క్లుప్తంగా

'అమలకంటి'కి డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకున్న అమలకంటి శ్రీనివాసరావు

సామర్లకోట: స్థానిక వ్యాపార వేత్త అమలకంటి శ్రీనివాసరావు శనివారం డాక్టరేట్‌ను అందుకున్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శిగా, ప్రతినిధిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో అంతర్జాతీయ సంస్కృతి పరిశోధన విశ్వవిద్యాలయం గుర్తించింది. ఈ మేరకు తమిళనాడులోని హోసూరులో జరిగిన కార్యక్రమంలో శనివారం ఆయనకు డాక్టరేట్ అందజేశారు. భక్తులకు ప్రతి కార్యక్రమంలోను ప్రసాద వితరణ చేయడంతోపాటు పేదలకు అండగా ఉండడం వంటి సేవలకు ఆయనకు ఈ గుర్తింపు వచ్చింది. అమలకంటి శ్రీనివాసరావుకు డాక్టరేట్ రావడంతో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, గవర్నర్ ముఖ్య సలహాదారు చిత్తూలూరి వీర్రాజులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ జూలై ఒకటో తేదీ నుంచి అమలకంటి శ్రీనివాసరావు సామర్లకోట–శ్రీ భీమేశ్వర లయన్స్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.

పీబీసీ కాలువలో మృతదేహం



లీలా సూర్యకిరణ్ మృతదేహం

పిఠాపురం: స్థానిక చిత్రాడ పీబీసీ కాలువలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పిఠాపురం పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్యుతాపురానికి చెందిన యనమండ్ర లీలా సూర్యకిరణ్(38)గా గుర్తించినట్లు తెలిపారు. ఆమె భర్త పవన్ మరణించగా కుమార్తెతో జీవిస్తుందన్నారు. రెండు రోజుల క్రితం కుమార్తెతో గొడవ పడి ఇల్లు విడిచి వచ్చినట్టు బంధువులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కరెంటు వైర్ల నుంచి మంటలు

పరుగులు తీసిన జనం



విద్యుత్తు వైర్ల నుంచి వస్తున్న మంటలు

సామర్లకోట: స్థానిక వీర్రాఘవపురంలోని తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్ల నుంచి శనివారం రాత్రి ఒకసారిగా మంటలు వచ్చాయి. దాంతో ఆ రోడ్డులో వెళుతున్న జనం పరుగులు తీశారు. సుమారు 30 నిమిషాల పాటు 11 కేవీ వైర్ల నుంచి మంటలు వస్తున్న ట్రాన్సు అధికారులు స్పందించలేదు. దీనిపై ఏఈ రమేష్‌కుమార్ దృష్టికి విషయం తీసుకు వెళ్లగా వెంటనే సిబ్బంది పంపించారు. విద్యుత్తు సరఫరాను నిలిపి వేసి మంటలు రాకుండా చర్యలు తీసుకున్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం

ప్రత్తిపాడు: ఆదివాసీ కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం తగదని రాష్ట్ర ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ సలహాదారు రాష్ట్ర కమిటి చైర్మన్ పీఎస్ అజయ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా ఆదివాసీ సంఘం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా ఆదివాసీ కుల ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివాసీలు జీవిస్తున్న మండలాల్లో ఆర్డీఓలు, తహసీల్దార్లు మారుతున్న సందర్భంలో ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలని కమిటి చైర్మన్ పీఎస్ అజయ్‌కుమార్ కోరారు.

ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించాలి

ఆదివాసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కంపూడి రాజు మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ అల్లూరి జిల్లాలో కలిసిపోయినా, పాత ఉమ్మడి జిల్లా ఆదివాసీ ప్రాంతాలు ఐటీడీఏ పరిధిలోనే ఉన్నాయని గిరిజన సంక్షేమ శాఖ వివరణ ఇచ్చిందన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కాకినాడ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించి, ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 12, 13 తేదీలలో అన్నవరంలో రాష్ట్ర సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లాలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న అటవీ భూములను సర్వే చేసి, పట్టాలు మంజూరు చేయాలని సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ జర్తా ముసలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, బాలరాజు, లచ్చబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

- హెల్మెట్ ధరించని వాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో తప్పని మరణాలు
- పోలీస్, రవాణా శాఖ అవగాహన కార్యక్రమాలు
- పట్టించుకోని ప్రజలు



హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మౌనిక

పెద్దాపురం: హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడం ప్రమాదమేనని చెప్పవచ్చు. తలకు భారంగా ఉందని, పట్టుకోవడానికి వీలుగా లేదని కొంత మంది నిర్లక్ష్యం చేస్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. మీ నిర్లక్ష్యం నిండు ప్రాణమని గుర్తుపెట్టుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. హెల్మెట్ మన రక్షణకే అనే సంగతి ద్విచక్ర వాహనదారులు మరచిపోతున్నారు. ఒక విధంగా చెప్పాలంటూ అది మనిషి ప్రాణాలకు రక్షణ కవచం వంటిది. నిర్లక్ష్యం చేయకుండా హెల్మెట్ ధరించాలంటూ నిత్యం పోలీసులు, రవాణా శాఖాధికారులు చెబుతున్నా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. తమ వారిని శోకసముద్రంలో ముంచుతున్నారు.

కీలక నిర్ణయాలు

ఇటీవల జాతీయ భద్రతా రహదారి వారోత్సవాల సభల్లో హెల్మెట్ వాడకం తప్పనిసరి చేస్తూ పోలీస్, రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించాలంటే హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని తీర్మానించారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లోనే మరణాల సంఖ్య అధికంగా ఉంటుంది. ప్రమాద ఘటనల్లో తల రోడ్డుకు తగిలి, బలమైన గాయాలపాలై చికిత్స పొందుతున్నవారు, మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అందుకే ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు.

మరణాల్లో యువతే అధికం

అతివేగం యువతను బలితీసుకుంటోంది. పోలీస్ రికార్డు ప్రకారం హెల్మెట్ లేకపోవడం వల్లే అధిక శాతం మంది ప్రమదాల బారిన పడి మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. తల్లిదండ్రులు వారి పిల్లలపై అధిక ప్రేమతో గారాబం చేస్తూ వారి కోరిక మేరకు అధిక ఇంజన్ సామర్థ్యం (సీసీ) ఉన్న ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ కోవలో ప్రధానంగా మైనర్లకు సైతం వాహనాలను అప్పగించడంతో వారి బైక్‌పై అతి వేగం నిండు ప్రాణాన్ని బలిగొంటోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత మూడేళ్ల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 850 మంది మరణించగా వారిలో చాలా మంది హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోయిన వారున్నారని పోలీసులు చెబుతున్నారు.

కారణాలివే

రోడ్డు మలుపు వద్ద వేగంగా వెళ్లడం, జాగ్రత్తలు పాటించకపోవడం. ప్రధాన కూడలి ట్రాఫిక వద్ద రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకపోవడం. ఒకే ద్విచక్ర వాహనం ముగ్గురు, నలుగురు నిర్లక్ష్యంగా ప్రయాణం చేయడం. మద్యం మత్తు, నిర్లక్ష్య డ్రైవింగ్, డ్రైవ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడడం, మైనర్లు, లైసెన్స్ లేని వారు వాహనాలు నడపడం, సరైన నైపుణ్యం లేని డ్రైవింగ్. రహదారి భద్రతపై అవగాహన లేకపోవడంతోనే ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పుకోవచ్చు.

సురక్షిత డ్రైవింగ్‌కు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరాలి. హెల్మెట్ ధరించకపోవడం వల్లే చాలా మంది ద్విచక్ర వాహనదారలు ప్రాణాలు కోల్పోతున్నారు. హెల్మెట్ ధరించడం భారంగా, బరువుగా భావించవద్దు. అది ప్రాణాలకు శ్రీరామరక్ష. ప్రాణం అన్నింటికంటే విలువైనది. పోలీస్, రవాణా శాఖాధికారులు హెల్మెట్ ధరించకుంటే కేసులు రాస్తారనే భావనతో కాకుండా తమ ప్రాణ రక్షణకై తనిఖీలు నిర్వహిస్తున్నారని గుర్తించాలి.

– మౌనిక, ఎస్‌ఐ, పెద్దాపురం

నిబంధనలు తీసుకువచ్చినా..



హెల్మెట్

2010లో హెల్మెట్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిబంధన తీసుకువచ్చినా అది పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఎంత అవగాహన కల్పించిన హెల్మెట్‌ధారణపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాల్లో యువత, పెద్దలు సైతం మత్యువాత పడుతున్నారు.

జలమయమైన అమీనాబాద్ వీధులు



అమీనాబాద్‌లో ఇళ్ల మధ్య నిలిచిపోయిన వర్షపు నీరు

కొత్తపల్లి: కురిసిన వర్షానికి మండలంలోని అమీనాబాద్‌లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ నీటితో నిండిపోయాయి. పలు రోడ్లలో నీరు నిలిచిపోయింది. పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో జ్వరాలతో ప్రజలు మంచాన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పంచాయతీ అధికారులతో ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలను దోమలు, రోగాలబారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక కన్యకా పరమేశ్వర సత్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు భవర్‌లాల్ డిజైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది గురు పూర్ణమి సందర్భంగా గత 16 సంవత్సరాలుగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు కంటి సమస్యలు లేకుండా చేయడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే ఇప్పటి వరకు 1915 మందికి కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వారిచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించామన్నారు. కంటి శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డు తీసుకురావాలన్నారు.

నెలవారీ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలి

- కమిషనర్‌కు సభ్యులు వినతిపత్రం అందజేత



కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

సామర్లకోట: చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాస తీర్మానం అనంతరం, తక్షణ చర్య తీసుకొని నెల వారి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని వైస్ చైర్మన్, సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అధ్యక్షతన 20 మంది సభ్యులు సంతకాలు చేసి కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. మే 15వ తేదీన కాకినాడ డివిజనల్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారన్నారు. కౌన్సిల్‌లో 30 మంది సభ్యులు ఉండగా 25 మంది తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో కౌన్సిల్ చైర్‌పర్సన్ విశ్వాసం పొందడంలో విఫలమయ్యారన్నారు. ఆమెకు ఒక్క సభ్యుడి మద్దతు కూడా లభించలేదని తెలిపారు. క్రమం తప్పకుండా నిర్వహించవలసిన కౌన్సిల్ సమావేశాలు గత నెలతో పాటు ఈనెలలో కూడా నిర్వహించే అవకాశం కనిపించడం లేదన్నారు. దీని కారణంగా పట్టణంలో అభివృద్ధి కార్యకపాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడానికి నెల వారి కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటు చేసే అధికారం, విధి కమిషనర్‌కు ఉన్నాయని తెలిపారు. తక్షణమే దీనిపై తగిన చర్య తీసుకొని ప్రజాస్వామ్యాని పరిరక్షించాలని సభ్యులు కమిషనర్‌ను కోరారు. అదే విధంగా అవిశ్వాస తీర్మానం విజయవంతంగా ఆమోదంతో గంగిరెడ్డి అరుణను చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగించాలని, కౌన్సిల్ సమావేశాలకు చర్యలు తీసుకోవాలని, పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, సీనియర్ సభ్యుడు ఆవాల లక్ష్మీనారాయణ, సభ్యులు రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, వారా పాప, నమ్మి సూర్య దుర్గ, చిట్టుమాని రాఘవ, స్వయభారపు వీరభద్రరావు, పాగా సురేష్ కుమార్, సేపెని సురేష్, యార్లగడ్డ జగదీష్, మత్రి శేషారావు, జట్ల మోహన్, పార్టీ నాయకు లు రెడ్నం దొరబాబు, చిట్టుమాని శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసు, పాలక చంటిబాబు, పెంద్యాల అబ్బు, నమ్మి శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెట్టు పట్టాదారులకు న్యాయం చేయాలి

- జీవనోపాధిని ఇచ్చే కొబ్బరి చెట్ల నరికివేత
- డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సభ్యులు

సామర్లకోట: చెట్టు పట్టాదారులకు న్యాయం చేయాలని ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు, కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ అందుబాటులో లేక పోవడంతో డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వీకే రాయపురం నుంచి సామర్లకోట మాండవ్యనారాయణస్వామి ఆలయం వరకు ఉన్న గోదావరి కాలువ చెట్టు గుట్టపై గడ్డి కోసుకోవడానికి, పశువులు పెంపకం చేసుకోవడానికి గట్టుపై ఉన్న కొబ్బరి చెట్ల ద్వారా ఫలసహాయం పొందడానికి 50 ఏళ్ల క్రితం జిల్లా కలెక్టరు తమ సంఘ సభ్యులకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. అయితే ఇటీవల కొంత మంది రైతులు మాండవ్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఉన్న గోదావరి కాలువ గట్టును సగ భాగం జేసీబీతో తొలగించారన్నారు. రైతుల పంట భూమి గోదావరి గట్టులో ఉందని గట్టు పొడవునా ఎకరం వరకు కలుపుకొన్నారని హరిబాబు చెప్పారు. గట్టుపై సర్వే చేయించి న్యాయం చేయాలన్నారు. పంట కాలువలో ఇరిగేషన్ నిబంధనలకు విరుద్ధంగా పైపులు వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి కాలువపై ఆధారపడి కొన్ని వందల ఎకరాల భూమి సాగవుతుందని చెప్పారు. గోదావరి కాలువ ఏర్పడి 100 సంవత్సరాలు దాటిందన్నారు. దీనిపై అధికారులు స్పందించి రైతులతో పాటు ఫీల్డు లేబర్ కో ఆపరేటివ్ సభ్యులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పి.శ్యామ్ సందరరావు, వి.రవి, పిట్టా ఏసు, జి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి అండగా దేవదాయ శాఖ

- ఆలయ ఆదాయానికి గండి కొడితే సహించం
- సకాలంలో సొమ్ములు చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించండి
- వేలంపాటలో పెరిగిన వేంకటేశ్వర స్వామి ఆదాయం



వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

పెద్దాపురం: రైతాంగానికి అండగా ఎప్పుడు దేవదాయ శాఖ పనిచేస్తుందని, అలా అని ఆలయ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నిస్తే సహించబోమని, వేలంపాట దారులు సకాలంలో వేలం సొమ్ములు చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర అన్నారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ భూమల వేలం పాటలు శనివారం ఈఓ పి.సాయిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పులిమేరుకు చెందిన రైతులు దమ్ము పోలీస్‌రావు, దమ్ము నాగేశ్వరరావు, దమ్ము అప్పన్న, మాసా అన్నవరం పేరిట 12.93 సెంట్ల భూమిని కౌలుకు బహిరంగ వేలం ద్వారా రూ.05,02,000కు దక్కించుకున్నారు. గతంలో ఇదే భూమిని రూ.2,74,000 కాగా ప్రస్తుతం అది రెండింతలు పెరగడంతో వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మరింత ఆదాయం సమకూరింది. కాగా వేలంపాట దక్కించుకున్న కౌలుదారులు అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులకు బినామీలుగా తెలిసింది. దీనిపై పన్ను ఎగవేసే ప్రయత్నం చేస్తారని తెలియడంతో అధికారులు తమ వంతు జాగ్రత్తలు పాటించి బహిరంగంగానే నిబంధలను వెల్లడించారు.

ఏఎస్సైకి ముద్రగడ పరామర్శ



బలరామ్‌ను పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

సామర్లకోట: పెద్దాపురం డివిజన్ క్రైం ఏఎస్సై గంగిరెడ్డి బలరామ్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం శనివారం పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యానికి గురి అయిన బలరామ్ దీర్ఘకాలిక సెలవుతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. విషయం తెలుసుకున్న ముద్రగడ పద్మనాభం, ఏఎస్సై బలరామ్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరిసే శివాజీ, గణేశుల రాంబాబు, రౌతు స్వామి, పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో టిడ్కో చైర్మన్ పూజలు



స్వామి వారిని దర్శించుకున్న టిడ్కో చైర్మన్ దంపతులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూలవిరాట్, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ స్వామి వారి ఫొటో, ప్రసాదం అందజేశారు. ఆలయంలో జరుగుతున్న అన్నదానాన్ని పరిశీలించి, తన వంతుగా రూ.10,116 విరాళంగా ఈఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పట్టణ జనసేన అధ్యక్షుడు సరోజ్ వాసు, నాయకులు పాల్గొన్నారు.

పాదగయను దర్శించుకున్న టిడ్కో చైర్మన్

పిఠాపురం: పాదగయా క్షేత్రాన్ని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి రాజరాజేశ్వరి సమేత కుక్కుటేశ్వర స్వామి, స్వయంభూ శ్రీ దత్తాత్రేయ స్వామి, పదో శక్తి పీఠం శ్రీపురుహూతికా అమ్మవార్ల దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం దేవస్థాన సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ వారికి శేష వస్త్రాలు, స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, మురాలశెట్టి సునీల్ కుమార్, సూరారపు సురేష్, మార్నీడి రంగబాబు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన సతీష్, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ వి.మణికుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి కొడితే ఎలా?

- భాగ్య నగర్ గ్యాస్ కంపెనీ నుంచి రావాల్సిన రూ. రెండు కోట్లు వసూలు చేయండి
- మున్సిపల్ అధికారులపై కౌన్సిల్ ఆగ్రహం
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం





మున్సిపల్ ఆదాయంపై ప్రశ్నిస్తున్న సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్ . సమావేశంలో అధికారులకు ఆదేశాలిస్తున్న ఇన్‌చార్జి చైర్మన్ సాయి ప్రసాద్ (ఇన్‌సెట్‌లో)

పెద్దాపురం: పట్టణ అభివృద్ధికి ఆదాయం తీసుకు రావాల్సిన అధికారులే గండి కొడితే ఏలా? ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కో నిబంధన అమలు చేస్తారా? పట్టణంలో బయో గ్యాస్ కంపెనీ ఏర్పాటుకు అనుమతులిచ్చినప్పుడే కంపెనీ మున్సిపాలిటీకి చెల్లించాల్సిన సొమ్ములను ఎందుకు వసూలు చేయలేదంటూ పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పురపాలక సంఘం సర్వ సభ్య సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మట్లాడుతూ భాగ్యనగర్ గ్యాస్ కంపెనీ అధికారులను మభ్య పెట్టి పెద్దాపురం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన సొమ్ములను ఎగవేసిందన్నారు. పక్కనే ఉన్న పిఠాపురం మున్సిపాలిటీకి సుమారు రెండు కోట్ల రూపాయలు మేర సొమ్ములు చెల్లించి అనుమతులు పొందారన్నారు. కానీ పెద్దాపురం మున్సిపాలిటీలో కనీసం చార్జీలు కూడా వసూలు చేయకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టారన్నారు. ప్రస్తుత మున్సిపల్ యంత్రాంగం స్పందించి గ్యాస్ పైపులైన్ ఫైల్‌ను రీ వెరిఫికేషన్ చేసి మున్సిపాలిటీకి రావాల్సిన సొమ్మును రికవరీ చేయాలని కోరారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కర్, పప్పల దుర్గారావు, విడదాసర రాజా మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో వారం రోజుల మంచినీటి సరఫరాను సక్రమంగా చేయకపోవడం ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం ఆషాఢ మాసం మరిడమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని అధికారులు మంచీ నీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. చైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ స్థానిక గానీ కోనేరు, పాండవుల మెట్ట వద్ద కూడా సంపులు నిర్మాణం చేపడితే పట్టణ ప్రజలకు మంచినీటి అవస్థలు తగ్గుతాయని, దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మరిడమ్మ జాతర భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడీవేడి చర్చ కొనసాగింది. తొలుత ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయి ప్రసాద్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు పుష్పగుచ్ఛం, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రకాశరావు, మేనేజర్ జ్యోతిరాణి, ఏఈ సధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆయా విభాగాల అధికారులతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, గోకేడ మరిడయ్య, పేరిశెట్టి అంబిక, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా సాయి ప్రసాద్



మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ సాయి ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా నెక్కంటి సాయిప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు యాత్రల కారణంగా నెల రోజుల పాటు అందుబాటులో ఉండకపోవడంతో వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న సాయిప్రసాద్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించి, తొలి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్ పర్సన్ వచ్చే వరకు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సాయి ప్రసాద్‌ను మున్సిపల్ కౌన్సిల్‌తో పాటు వైఎస్సార్ సీపీ అయ్యారక విభాగం రాష్ట్ర నాయకులు నెక్కంటి సాయి ప్రసాద్, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, సామర్లకోట పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పాగా సురేష్, సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా అభినందించారు.

మహంకాళి అమ్మవారి ఆలయంలో హోమం



ఆలయంలో హోమం చేస్తున్న పండితులు

సామర్లకోట: నవర గ్రామంలో ఉన్న ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శనివారం గ్రామ సర్పంచ్, ఆలయ ధర్మకర్త, మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు దమ్మాల లక్ష్మణరావు దంపతులు హోమం నిర్వహించారు. ఆదివారం భోనాల సంబరాన్ని పురస్కరించుకొని హోమం పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని తన సొంత ఖర్చుతో నిర్మాణం చేయడంతో ప్రతి ఏడాది ఆషాడ మాసంలో జాతర నిర్వహిస్తున్నట్టు దమ్మాల లక్ష్మణరావు తెలిపారు. గత మూడేళ్లుగా బోనాల సంబరం నిర్వహించిన్నట్టు చెప్పారు. ఆదివారం తమ దంపతులు బోనాలు ఎత్తుకొని ఉత్సవాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. భక్తుల కోసం అన్నదానం ఉంటుందన్నారు. శనివారం ఆలయ అర్చకులు శివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.